www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శనివారం | 08 | ఫిబ్రవరి | 2025 పేజీలు 8

## పులిగుండాల ప్రాంతంలో చిరుతపులి సంచారం




# ధరల పతనం.. సంక్షోభంలో సాగు..!

-రోజురోజుకు పడిపోతున్న వ్యవసాయ ఉత్పత్తుల ధరలు
-పట్టించుకోని పాలకులు -అప్పల ఊబిలో రైతులు





ప్రజాపక్షం/ఖమ్మం : వ్యవసాయ రంగం పరిస్థితికి నానాటికి తీసికట్టు నానంబొట్టు అన్న సామెతలా తయారైంది. రోజు రోజుకు మరింత సంక్షోభంలోకి కూరుకుపోతుంది. కలిసి రాని ప్రకృతి, సహకరించని పాలకులు, తగ్గిన దిగుబడులు, పెరిగిన పెట్టుబడులు , గిట్టుబాటు కాని ధరల నేపథ్యంలో రైతాంగం అప్పుల ఊబిలో కూరుకుపోతుంది. ఈ యేడు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం ధాన్యం కొనుగోలు చేస్తుండడంతో ఒక్క ధాన్యం మినహాయించి మిగిలిన వ్యవసాయోత్పత్తుల ధరల పరిస్థితి దయనీయంగా ఉంది. ముఖ్యంగా వాణిజ్య పంటలైనా పత్తి, మిర్చి ధర ఈ ఏడాది రైతాంగానికి ఆశనిపాతంలా తగిలింది. తెలంగాణ రాష్ట్రంలో దక్షిణ

మిగతా 2లో..

## పదిలో నూరుశాతం ఫలితాలు సాధించాలి

-బోధన నాణ్యతపై ప్రధానోపాధ్యాయులు దృష్టి సారించాలి
-కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



2లో



# ధరల పతనం.. సంక్షోభంలో సాగు..!

(మొదటిపేజీ తరువాయి)



తెలంగాణలో ప్రధానంగా పండించే వాణిజ్య పంటలైన మిర్చి, పత్తి రైతులు ఈ ఏడాది తీవ్రంగా నష్టపోయారు. గతేడాది ఏడువేల రూపాయల వరకు ధర పలికిన పత్తి ఈ ఏడాది నాలుగు వేల రూపాయలకు మించి ధర పలకలేదు. అతివృష్టి కారణంగా దిగుబడి గణనీయంగా తగ్గింది. ఖమ్మంజిల్లాలో సగటున 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి వచ్చే పత్తి ఈ ఏడాది సగటు దిగుబడి నాలుగు క్వింటాళ్లకు మించలేదంటే అతిశయోక్తి కాదు. ఒక పక్క దిగుబడి తగ్గి మరో పక్క గిట్టుబాటు ధర లేక ఈ ఏడాది పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయారు. కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయం. పత్తి పరిస్థితి ఈవిధంగా ఉంటే మిర్చి అయిన ఆదుకోకపోతుందా అని రైతులు ఆశగా చూశారు. కాని మిర్చి రైతుకు మరో రెండేళ్ల కోలుకోలేనివిధంగా ఎదురు దెబ్బ తగిలింది. గతేడాది రూ. 20వేల పైబడి పలికిన మిర్చి ధర ఈ ఏడాది రూ. 13వేలకు మించి కొనుగోలు చేసిన దాఖలాలు లేవు. అదిలో అధిక వర్షాల కారణంగా రెండు మూడు సార్లు మిర్చి మొక్కలను నాటాల్సి వచ్చింది. ఆ తర్వాత తెగుళ్లు, ఇతరత్రా కారణాలతో పెట్టుబడులు గణనీయంగా పెరిగాయి. పెరిగిన రసాయనిక ఎరువుల ధరలు, క్రిమిసంహారక మందుల ధరల కారణంగా రైతులు అప్పులు తీసుకు వచ్చి సాగు చేయాల్సి వచ్చింది. తీరా మార్కెట్‌కు వస్తే గతేడాది తాలు మిర్చి పలికిన ధర కూడా ఈ ఏడాది మొదటి కోత మిర్చికి కూడా ఆ ధర రాలేదు. ప్రభుత్వం దీనిపై దృష్టి సారించడం లేదు. వ్యవసాయ ఉత్పత్తుల ధరలు గత మూడేళ్లలో చూసినప్పుడు కనిష్ట స్థాయికి పడిపోవడంతో రైతులు ఆర్థికంగా నష్టపోయారు. వ్యవసాయ రంగంలో రైతుల పరిస్థితి చూస్తుంటే ఒక ఏడాది కలిసి వస్తే మూడేళ్ల నష్టాలు వస్తున్నాయి. ఈ ఏడాది ప్రకృతిపరంగా కాస్త ఫర్వాలేదనుకుంటే వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పతనమై మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. కేంద్ర ప్రభుత్వం గిట్టుబాటు ధరల విషయంలో అనుసరిస్తున్న వైఖరి రైతుల పాలిట శాపంగా మారింది. పెట్టుబడి ఆధారంగా మద్దతు ధరను నిర్ణయించాలని మూడు నాలుగేళ్లుగా జరుగుతున్న రైతాంగ ఉద్యమాన్ని పూర్తిగా విస్మరిస్తుంది. మద్దతు ధర లేకపోవడమే ఈ దుస్థితికి కారణమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 50 శాతం మంది ఆధారపడిన వ్యవసాయ రంగాన్ని విస్మరిస్తే భవిష్యత్తులో దేశ ఆర్థిక రంగంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇప్పటికే వ్యవసాయ రంగం నుంచి లక్షలాది కుటుంబాలు ప్రతి యేటా వైదొలిగి ప్రత్యామ్నాయ రంగాల వైపు వెళ్తున్నారు. యువ రైతులు గ్రామాల్లో మచ్చుకు కూడా కనిపించడం లేదు. పట్టణ కూలీలు పెరగడానికి, పట్టణీకరణ పెరగడానికి కూడా వ్యవసాయ రంగ సంక్షోభమే కారణమవుతుంది. ఇప్పటికే నిరుద్యోగం పెరిగి ఉపాధి కల్పన రంగాలు వట్టిపోయిన తరుణంలో మరంత విస్మరిస్తే పెను ప్రమాదమన్న వాస్తవాన్ని పాలకులు గ్రహించాల్సి ఉంది. వ్యవసాయ రంగ సంక్షోభ నివారణకు, వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభించేందుకు తక్షణ చర్యలు చేపట్టాల్సి ఉంది. ఆ దిశగా పాలకులు ఆలోచన చేయకపోతే పెను ప్రమాదాన్ని ఎదుర్కొనక తప్పదు.

# పదిలో నూరుశాతం ఫలితాలు సాధించాలి



ప్రజాపక్షం/ఖమ్మం : జిల్లాలో పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో నూటికి నూరు శాతం ఫలితాలను సాధించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులకు సూచించారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులతో పదవ తరగతి పరీక్షల సన్నద్ధత, విద్యాశాఖ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యా బోధన జరుగుతుందని తల్లిదండ్రులకు నమ్మకం కల్పించాల్సిన బాధ్యత బోధన సిబ్బంది పై ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాల్లో బోధన పరిస్థితులను ప్రధానోపాధ్యాయులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ పిల్లలకు సులభంగా అర్థమయ్యేలా బోధన జరిగేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. బోధనకు సంబంధించి నిరంతర పర్యవేక్షణ తర్వాత ఉపాధ్యాయులకు సరైన సలహాలు ఇవ్వాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. చదువులో ఎవరు వెనకబడటానికి వీలు లేదని ప్రతి ఒక్కరికి అర్థమయ్యేలా బోధన జరగాలన్నారు. తరగతి గదిలో బోధన పట్ల విద్యార్థులు ఆకర్షితులయ్యేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని, వెనకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులు పౌష్టికాహారం మాత్రమే తీసుకునేలా అవగాహన కల్పించాలని, పదవ తరగతి మార్కులే ప్రధానమన్న విషయాన్ని విద్యార్థులకు తెలియజేస్తూ అత్యుత్తమ మార్కుల సాధనకు కృషి చేయాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ 100 శాతం ఫలితాలను సాధించాలని దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రభుత్వ రంగంలో విద్య పునర్ వైభవానికి కృషి జరగాలని మనం పనిచేయడం ప్రారంభిస్తే ఫలితాలు అవే వస్తాయన్నారు. విద్యార్థులను తీర్చిదిద్ది వారి భవిష్యత్తును అత్యుత్తమంగా ఉండేలా చూసే అవకాశం గురువులకు దక్కుతుందని ఆ విషయాన్ని నిరంతరం మననం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులు, బోధన తదితర అంశాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖర శర్మ, మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీ

### -ఇద్దరు మృతి

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : రఘునాథపాలెం మండలం బూడిదంపాడు వద్ద ద్విచక్ర వాహనాన్ని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టిన ప్రమాదంలో వరుసకు సోదరులైన భూక్యా విజయ్ (33), తేజావత్ వీరబాబు అనే ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతిచెందారు. సిఐ ఉస్మాన్ షరీఫ్, గ్రామస్తుల కథనం ప్రకారం... లారీ డ్రైవర్‌గా పని చేసే వీరబాబు, పిన్ని కుమారుడైన విజయ్ కూలీ కూలీ పనులు చేసేవాడు. కారేపల్లి మండలంలో తెలిసిన వాళ్లు చనిపోతే వాళ్లను పరామర్శించడం కోసం వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో బూడిదంపాడు రైతు వేదిక సమీపంలో గుర్తు తెలియని వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయారు. వీరిలో విజయ్ మృతదేహంపై వాహనం వెళ్లడంతో ముఖం నుజ్జు అయింది. సమాచారం అందుకున్న పోలీసులు అన్నం ఫౌండేషన్ నిర్వహకుడు అన్నం శ్రీనివాసరావు వారి బృం దం ఆధ్వర్యంలో మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ప్రమాదానికి గురైన వాహనం కోసం గాలిస్తున్నట్లు సిఐ తెలిపారు. విజయ్‌కు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. వీరబాబుకు భార్య, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తె వివాహం చేసేందుకు గత కొద్ది రోజుల క్రితం లగ్నం కూడా పెట్టుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

## సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు సిద్ధం

### -ఆర్టీసి జేఏసి హెచ్చరిక

### -ఖమ్మం డిపో ఎదుట కరపత్ర ప్రచారం



ప్రజాపక్షం/ఖమ్మం : ఆర్టీసిలో కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే సమ్మె తప్పదని ఆర్టీసి జేఏసి నేతలు హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15మాసాలు కావస్తున్నా ఆర్టీసి గురించి ఏ మాత్రం పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. శుక్రవారం ఖమ్మం డిపో ఎదుట జేఏసి ఆధ్వర్యంలో కరపత్రాన్ని విడుదల చేసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిజిఎస్ ఆర్టీసి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి, జేఏసి నాయకులు జిఎస్ నారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా ఆర్టీసి కార్మికులను తీసుకుంటామని హామీ ఇచ్చారని రెండేళ్లు కావస్తున్నా అపాయింటెడ్ తేదీని ప్రకటించడానికి ఎందుకు తాత్సర్యం చేస్తున్నారని ప్రశ్నించారు. ఆర్టీసిలో గుర్తింపు ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసిన పట్టించుకోవడం లేదన్నారు. ఆర్టీసిలో రిటైర్‌మెంట్లు తప్ప రిక్రూట్‌మెంట్లు లేవని 16వేల మంది కార్మికులు పదవి విరమణ పొందగా వారి స్థానంలో నేటి వరకు ఎవరిని నియమించ లేదని నారాయణ తెలిపారు. మహాలక్ష్మి పథకాన్ని కార్మికులు ఇబ్బందులకు ఎదురొడ్డి విజయవంతంగా నిర్వహిస్తున్నారని అయిన యాజమాన్యం ప్రభుత్వం కార్మికుల గురించి పట్టించుకోవడం లేదన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే సమ్మెబాట పడతామని ఇప్పటికే సమ్మె నోటీసు ఇవ్వడం జరిగిందని నారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం డిపో జేఏసి చైర్మన్ బేతంపూడి బుచ్చిబాబు, జేఏసి నాయకులు అనిత, హరినాథ్‌బాబు, దామర్ల లాజర్ తదితరులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా స్మార్ట్‌కిడ్జ్‌లో స్పోర్ట్స్ మీట్



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : స్మార్ట్‌కిడ్జ్ స్పోర్ట్స్ మీట్ 2025ను పాఠశాల మైదానంలో శుక్రవారం అట్టహాసంగా ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా క్రీడా యువజన అధికారి తుంబూరు సునీల్‌రెడ్డి విద్యార్థులు నిర్వహించిన గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం క్రీడల లోగోను డివైఎస్‌వో సునీల్‌రెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్యలు బెలూన్లు ఎగురవేసి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులను మానసికంగా, శారీరకంగా, ధృడంగా తయారు చేయడానికి క్రీడా పోటీలు క్రీడా స్ఫూర్తిని నింపుతాయన్నారు. పుస్తకాలతో బిజీ బిజీగా గడిపే విద్యార్థులకు మానసిక ఉల్లాసాన్ని కలిగించడానికి, మరింత చురుకుగా చదువుల్లో రాణించడానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ప్రతి ఏడాది స్మార్ట్‌కిడ్జ్ పాఠశాలలో స్పోర్ట్స్ మీట్‌ను నిర్వహించడం జరుగుతుందన్నారు. గెలుపోటములను పరిగణలోకి తీసుకోకుండా క్రీడా స్ఫూర్తితో మరింతగా రాణించాలని కోరారు. పాఠశాల ప్రారంభించిన నాటి నుంచి గత దశాబ్ద కాలంగా ప్రతి ఏడాది పాఠశాలలో ప్రత్యేకంగా స్పోర్ట్స్ మీట్ నిర్వహించి విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు వివిధ రకాల క్రీడా పోటీలను నిర్వహించారు. క్రీడా పోటీలు శనివారంతో ముగుస్తాయన్నారు. గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రధానం చేస్తామని పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య తెలిపారు.

## అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ భూములు కబ్జా



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మహ్మద్ సలాం తెలిపారు. శుక్రవారం సిపిఐ ప్రతినిధి బృందం ఆర్డీవోని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సలాం మాట్లాడుతూ దర్జాగా వెంచర్లు వేసి వ్యాపారాలు నిర్వహిస్తున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. ఖమ్మం కార్పోరేషన్ పరిధిలో దానవాయిగూడెం పార్క్, ఎన్నెస్పి క్యాంపు, రమణ గుట్ట తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయన్నారు. సిపిఐ పార్టీ పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేదన్నారు. నగర సహాయ కార్యదర్శి యానాలి సాంబశివరెడ్డి మాట్లాడుతూ అధికారులు ఓ బృందాన్ని ఏర్పాటు చేసి ప్రతి రోజు నగరంలో జరుగుతున్న కబ్జాలు, ఎక్కడ ఏమి జరుగుతుంది, ఉన్న దస్తావేజులు సరైనవా కావా అని చూడటం చేయాలన్నారు. త్రిటౌన్ ఏరియా కార్యదర్శి నూనె శశిధర్ మాట్లాడుతూ నగరంలో ఇల్లు లేని పేదలు అనేక మంది తలదాచుకోవడం కోసం దరఖాస్తు చేసుకున్న గజం స్థలం ఇవ్వని ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులకు అండగా ఉంటున్నారన్నారు. తక్షణమే ప్రభుత్వ భూములను రక్షించి తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. స్పందించిన ఆర్డీవో తగు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జాలా నర్సింహారావు, ఎస్‌కె చాన్, ఎండి మజీద్, డాక్టర్ ఖాసీంపాషా, ఎండి రెహ్మాన్, దుర్గానాథ్, అతిక్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ సాక్షిగా ఆదర్శ వివాహం



ప్రజాపక్షం/పెనుబల్లి: మండల పరిధి లోని టేకి శుక్రవారం వరుడు బీరవల్లి ప్రశాంత్, వధువు నాగజ్యోతి దంపతుల ఆదర్శ వివాహం జరిగింది. వివాహ కర్తలు పత్తిపాటి వెంకటేశ్వర రావు, డా. కొచ్చర్ల శ్రీనివాసరావు, మీసాల రామచంద్ర రావు (అడ్వకేట్)మేకతోట్టి కాంతయ్య రాజ్యాంగంపై ప్రమాణంచేయించి, అంబేద్కర్ ఫోటో కి పూలదండ వేయించి, మతాలకు, సాంప్రదాయాలకు అతీతంగా వధూవరులకు దండలు మార్చించి నిరాడంబరంగా స్టేజ్ మ్యారేజ్ చేయడం జరిగింది.. వధూవరులు ఇద్దరు పోలీస్ డిపార్ట్మెంట్ కు చెందినవారు. పెనుబల్లి మండలం గ్రామానికి చెందిన వరుడు బిటెక్ చదివి జార్ఖండ్ రాష్ట్రంలో సిసిఫ్ లో విధులు నిర్వహిస్తుండగా, ఆంధ్రప్రదేశ్‌లోని ఏ. కొండూరు గ్రామానికి చెందిన వధువు బియస్‌సి చదివి విజయవాడ (ఏ.పి)లో ఏఆర్ పోలీస్ గా విధులు నిర్వహిస్తున్నారు. విద్యావంతులైన ఈ ఇరువురికి పెద్దలు కుదిరించిన సంబంధం ఆదర్శ వివాహానికి సిద్ధపడటం అభినందించదగ్గ విషయం. బంధుమిత్రులు, గ్రామస్తులు వందల సంఖ్యలో హాజరై వధూవరులను అభినందించారు.

## అనంతరాములుకు నివాళి



ప్రజాపక్షం/ఖమ్మం : ఖమ్మంజిల్లాకు చెందిన మాజీ కేంద్ర మంత్రి, పిసిసి మాజీ అధ్యక్షులు, లోక్‌సభ మాజీ సభ్యులు మల్లు అనంతరాములు వర్ధంతిని పురస్కరించుకుని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అనంతరాములు సోదరుడు మల్లు భట్టివిక్రమార్క నేతృత్వంలో ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మల్లు అనంతరాములు సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తెలంగాణ ఇంచార్జి గీతాదాస్ మున్షి, పిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్ తదితరులు ఉన్నారు.

# భవన నిర్మాణ సంక్షేమ బోర్డుకు వెయ్యికోట్లు కేటాయించాలి

**ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు**

**ప్రజాపక్షం/బోనకల్‌:** భవననిర్మాణ కార్మికులకు ఉపయోగపడే సంక్షేమ బోర్డుకు బడ్జెట్‌లో రూ.1000కోట్లు కేటాయించాలని ఏఐటి యూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో భవన నిర్మాణ కార్మికులు తీవ్ర అన్యాయం జరిగిందని అన్నారు. ప్రతి కార్మికుడు సంక్షేమ బోర్డులో రూ.110లు చెల్లించి నమోదు చేసుకున్నారని, ఆ నగదులో రూ.1000 కోట్లు కాళేశ్వరం ప్రాజెక్టు తరలించారని అన్నారు. ఆ నిధులను తిరిగి మరల సంక్షేమ బోర్డులో జమచేయాలని ఏఐటియూసీ పక్షాన డిమాండ్‌ చేస్తున్నామని అన్నారు. 1996వ సంవత్సరంలో అప్పటి ఏఐటియూసీ నాయకులు కేంద్ర హోం శాఖమంత్రి ఇంద్రజిత్‌ గుప్తా, కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి చతురానన్‌ మిశ్రా, పార్లమెంటు సభ్యులు గురుదాస్‌ దాస్‌గుప్తాల పోరాట ఫలితంగా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పడిందని ఆయన గుర్తు చేశారు. 1996లో పశ్చిమ బెంగాల్‌, త్రిపుర, కేరళ, తమిళనాడుల రాష్ట్రాలలో అమలులోకి రాగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2009లో సంక్షేమ బోర్డు ఏర్పడిందని అన్నారు. ఆనాటి నుండి నేటి వరకు కార్మికుల సంక్షేమం కొరకు ఆ బోర్డు పనిచేస్తుందని, ఇప్పటి వరకు 18 లక్షల మంది భవన నిర్మాణ కార్మికుల అందులో సభ్యులుగా చేరారని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కొరకు ఏఐటియూసీ ఆధ్వర్యంలో అనునిత్యం పోరాటాలు చేస్తున్నాయని, అందులో భాగంగానే మార్చి 1వ తేదిన ఖమ్మం నగరంలోని కొత్తగూడెం గ్రామంలో జరిగే తెలంగాణ రాష్ట్ర బిల్డింగ్‌ అండ్‌ కన్‌స్ట్రక్షన్‌ వర్కర్స్‌ యూనియన్‌( ఏఐటియూసీ) 4వ జిల్లా మహాసభలు జరగనున్నాయని వాటిని జయప్రదం చేయావల్సిందిగా భవన నిర్మాణ కార్మికులను కోరారు. ఈ సమావేశంలో ఏఐటియూసీ జిల్లా అధ్యక్షులు గాదె లక్ష్మీ నారాయణ, జిల్లా నాయకులు యంగల ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.




# గౌడ జన హక్కుల పోరాట సమితి క్యాలెండర్‌ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్‌ :** ఖమ్మంజిల్లా కేంద్రంలో గౌడ సంఘం జేఏసి రాష్ట్ర వైస్‌ చైర్మన్‌ అమరగాని వెంకన్నగౌడ్‌ స్వగృహంలో వివిధ మండలాల గౌడ సంఘం పెద్దలు, యువకులు క్యాలెండర్‌ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఖమ్మం జిల్లా అధ్యక్షులు బండి నాగేశ్వరరావు గౌడ్‌ ఆధ్వర్యంలో శుక్రవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గౌడుల అభ్యున్నతికి కృషి చేయాలని, అందరికీ సభ్యత్వాలు, అర్హులందరికీ పెన్షన్లు అందజేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అధిక సంఖ్యలో గౌడ కులస్తులు పాల్గొనాలని ఆయన కోరారు. గౌడ కులస్తులు అందరూ ఐక్యమత్యంతో ఉంటే ఎన్ని విజయాలైనా సాధించవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో మోకు దెబ్బ రాష్ట్ర కార్యదర్శి తొలుపునూరి దానయ్య గౌడ్‌, ఖమ్మంజిల్లా ప్రధాన కార్యదర్శి మరికంటి వెంకట్‌ గౌడ్‌, జిల్లా అధికార ప్రతినిధి పంది శ్రీనివాస్‌ గౌడ్‌, తాళ్ల శ్రీనివాసరావు గౌడ్‌, జిల్లా కార్యదర్శి, చింతకాని మండల అధ్యక్షులు బండి ఉపేందర్‌ గౌడ్‌, యూత్‌ అధ్యక్షులు గోపి గౌడ్‌, రఘునాథపాలెం మండలాధ్యక్షులు గుంటి రామారావు గౌడ్‌, కారేపల్లి మండల అధ్యక్షులు పొలగాని శ్రీనివాస్‌ గౌడ్‌, గోపా వైస్‌ ప్రెసిడెంట్‌ తోడేటి దుర్గాప్రసాద్‌ గౌడ్‌, తిరుమలాయపాలెం మండల అధ్యక్షులు మొక్క రవీందర్‌ గౌడ్‌, గడ్డమీద రామారావు గౌడ్‌, గడ్డం ఉపేందర్‌ గౌడ్‌, ఖమ్మంజిల్లా గౌడ సంఘం నాయకులు పొట్లపల్లి రాజా గౌడ్‌, కిరణ్‌, పోతగాని కృష్ణారావు గౌడ్‌, ఖమ్మం సిటీ అధ్యక్షులు కందాల వీరేందర్‌ గౌడ్‌, గౌడ సంఘం పెద్దలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# వరి పొలాలను పరిశీలించిన ఏవో

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్‌ :** మండలంలో సుమారు 1500 ఎకరాల్లో వరి సాగు చేపట్టినట్లు మండల వ్యవసాయ అధికారి ఉమా మహేశ్వరరెడ్డి తెలిపారు. మండలంలోని కెవి బంజర గ్రామంలో సాగు చేసిన వరి పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వరి పంట నాటుపెట్టి 20 నుంచి 30 రోజుల దశలో ఉందని ఈ దశలో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపడితే అత్యధిక దిగుబడులు సాధించవచ్చున్నారు. నాటు పెట్టి 20 రోజులైనటువంటి వరిపంటకు పైపాటుగా 35 కేజీల యూరియా, 15 కేజీల పొటాష్‌ అందించాలన్నారు. రసాయనిక ఎరువులను పొలంలో బురద పదునులో వేసుకుని రెండు రోజుల తర్వాత నీటి తడి ఇవ్వాలన్నారు. అదేవిధంగా రెండో దఫా ఎరువులను పైరు 55 నుండి 50 రోజుల దశలో ఎకరానికి 40 కేజీలు యూరియా, 20 కేజీల పొటాష్‌ను వేసుకోవాల్సిందిగా ఆయన సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో వరి పంటలో ఆకు చుట్టు పురుగు, కాండం తొలుచు పురుగు ఉధృతి నివారణకు ఎకరానికి 500 గ్రాములు కార్టాప్‌ హైడ్రోక్లోరైడ్‌ అనే పురుగు మందును 10 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేసుకున్నట్లయితే సమర్థవంతంగా ఈ పురుగును నివారించుకోవచ్చు నన్నారు. వరి పంటలో కలిపి యాజమాన్యం కొరకు కౌన్సిల్‌ యాక్టివ్‌, నామిని గోల్డ్‌ వంటి కలుపు మందులను వాడి కలుపును సమర్థవంతంగా నివారించుకోవచ్చునని ఏవో తెలిపారు.



# శ్రీ చైతన్య విద్యార్థినికి బంగారు పతకం

**- అభినందించిన కళాశాల చైర్మన్‌ మల్లెంపాటి శ్రీధర్‌**

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్‌:** ఖమ్మంరూరల్‌ మండలం పొన్నెకల్లుపంచాయతీపరిధిలో గల శ్రీ చైతన్య ఇన్స్టిట్యూట్‌ ఆఫ్‌ టెక్నాలజీ అండ్‌ రీసెర్చ్‌ కళాశాలలో ఎలక్ట్రికల్‌ ఇంజనీరింగ్‌ చదువుతున్న షేక్‌ అయేష బేగం బంగారు పతకాన్ని సాధించింది. ఇది ఫిబ్రవరి 6వ తేదీన హైదరాబాద్‌లోని జవహర్‌లాల్‌ నెహ్రు టెక్నాలజికల్‌ యూనివర్సిటీ 13వ స్నాతకోత్సవం సందర్భంగా..ఎలక్ట్రికల్‌ విభాగంలో 202024కు గాను లభించింది. అలాగే ఎలక్ట్రికల్‌ విభాగంలో 8.79 గ్రేడింగ్‌ పాయింట్లతో టాపర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా సదరు విద్యార్థిని కళాశాలలో శుక్రవారం కళాశాల చైర్మన్‌ మల్లెంపాటి శ్రీధర్‌, కళాశాల ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ సాయిగీతిక, కళాశాల డైరెక్టర్‌ శ్రీవిద్యలు అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్‌ డాక్టర్‌ సుదర్శన్‌, కళాశాల ఎలక్ట్రికల్‌ విభాగ అధిపతి సిహెచ్‌ కృష్ణప్రసాద్‌, కళాశాల అడ్మినిస్ట్రేటివ్‌ ఆఫీసర్‌ వైశాలి, ట్రైనింగ్‌ అండ్‌ ప్లేస్‌మెంట్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ రాజేష్‌, వివిధ విభాగాల అధిపతులు, డాక్టర్‌ రాజేష్‌, చిరంజీవి, శ్రీకుమార్‌ తదితరులు పాల్గొన్నారు.



# కలకొడిమ గుడి అభివృద్ధికి అండగా ఉంటా

**ప్రజాపక్షం/ తల్లాడ :** బిజెపి తల్లాడ మండల కమిటీ ఆధ్వర్యంలో దేవాలయాల సందర్శనలో భాగంగా శుక్రవారం కలకొడిమ విచ్చేసిన ఎండోమెంట్‌ అధికారి సుదర్శన్‌ ప్రసాద్‌ తివారి గుడి అభివృద్ధికి అండగా ఉంటామని అన్నారు. ఎండోమెంట్‌ అధికారులతో మాట్లాడి గుడి నిర్మాణ అభివృద్ధికి ఎండోమెంట్‌ సంస్థ నుండి నిధులు మంజూరు అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈసందర్భంగా సంగీతం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సుదర్శన్‌ తివారిని శాలువాతో సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు చల్లా నాగులు, మండల ఉపాధ్యక్షులు సంగీతం సాయిచంద్‌, మండల నాయకులు రాయల రమేష్‌, పులి వెంకటేశ్వర్లు, చౌడ నాగేశ్వరరావు, కటికి నర్సింహారావు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# రూ.2లక్షల రుణమాఫీ చేయాలని ధర్నా

**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండలం కుర్నవల్లి ఐఒబి బ్యాంక్‌ పరిధిలో ఉన్న గ్రామాల రైతులు ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ తమకు ఇప్పటి వరకు రాలేదని, తక్షణమే రూ.2లక్షలు రుణమాఫీ చేయాలని బ్యాంకు ముందు తెలంగాణ రైతు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు సేలం సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రతి రైతుకు రూ.2లక్షలు రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం వాగ్దానం చేసి కొంతమంది రైతులకు మాత్రమే రుణమాఫీ చేసి చేతులు దులుపుకుందని విమర్శించారు. ప్రతి గ్రామంలో రుణమాఫీ కాని రైతులు ఉన్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం రుణమాఫీ కాని రైతులను గుర్తించి వారికి రుణమాఫీ అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు, రైతులు ఆదూరి జీవరత్నం, కొమ్మినేని ఆదినారాయణ, కట్ల దుర్గారావు, ఐలూరు రామకృష్ణారెడ్డి, ఎక్కిరాల పుల్లయ్య, బొగ్గుల లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# డిసిసిబి బ్యాంక్‌ను సందర్శించిన చైర్మన్‌ దొండపాటి

**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్‌ను డిసిసిబి చైర్మన్‌ దొండపాటి వెంకటేశ్వరరావు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా బ్యాంక్‌లో ఆయన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి మేనేజర్‌ రమ్యశ్రీని పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు, ఖాతాదారులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వం అందించే రుణాలను అర్హులైన లబ్ధిదారులందరికీ అందేవిధంగా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్‌ సిబ్బంది మురళీమోహన్‌రావు ఉన్నారు.



# ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికలకు సర్వం సిద్ధం

**ప్రజాపక్షం/ తల్లాడ :** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు తల్లాడ ఎంపిడిఓ చంద్రమౌళి తెలిపారు. శుక్రవారం ఆయనను కలిసిన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు ఎన్నికల ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. తల్లాడ మండలంలోని క్రీస్తుజ్యోతి కళాశాలలో స్ట్రాంగ్‌ రూములు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తల్లాడ, ఏన్కూరు, కల్లూరు మండలాల కౌంటింగ్‌ ప్రక్రియ కూడా ఈ కళాశాలలోనే ఉంటాయని వివరించారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా మండలంలో ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా మౌలిక సదుపాయాలు, ఓటింగ్‌కు కావాల్సిన ఏర్పాట్లు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మండల అధికారులు స్ట్రాంగ్‌ రూములను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్‌ వాణిశ్రీ, మధుకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# సాగు మెలుకువలపై రైతులకు అవగాహన

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్‌:** ఖమ్మం రూరల్‌ మండలంపరిధిలోని తల్లంపాడు, పొన్నెకల్‌, మద్దులపల్లి గ్రామాలలో జిల్లా ఉద్యాన,పట్టు పరిశ్రమ అధికారి ఎం.వీ మధుసూదన్‌ గురువారం పర్యటించారు. ఇందులో భాగంగా అక్కడి రైతులు సాగు చేసుకున్న ఆయిల్‌ఫామ్‌, పందిరి కూరగాయల సాగు, మామిడి తోటలను పరిశీలించారు. అనంతరం రైతులు సాగులో తీసుకోవాల్సిన మెలుకువలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీసిటీ చైర్మన్‌ గరికపాటి వెంకట్రావ్‌, పాలేరు ఉద్యాన అధికారి పి.అపర్ణ, రైతులు మల్లయ్య, హనుమంతరావు, రామలింగయ్య, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



# ద్విచక్ర వాహనాలు ఢీకొని వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/బోనకల్‌:** మండలంలోని కలకోట వద్ద ప్రధాన రహదారిపై రెండు ద్విచక్రవాహనాలు శుక్రవారం ఢీకొని ఆళ్లపాడుకు చెందిన తాళ్లూరి నాగేశ్వరరావు(60) అక్కడిక్కడే మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. తాళ్లూరి నాగేశ్వరరావు ఆళ్లపాడు కాలాసు పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఉదయం మధిరలో బంధువుల పెళ్లి కార్యక్రమంలో పాల్గొని తిరుగూ ప్రయాణంలో కలకోట బస్టాండ్‌ సమీపంలో మరో ద్విచక్రవాహనం ఢీకొని అక్కడిక్కడే మృతి చెందాడు. మృతునికిభార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుదేహాన్ని స్థానిక పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పులిగుండాల ప్రాంతంలో చిరుతపులి సంచారం





**ప్రజాపక్షం/పెనుబల్లిః** మండల పరిధిలోని బ్రహ్మళ్లకుంట పంచాయతీ గ్రామ శివారు పరిధి లో చిరుతపులి సంచరిస్తున్నట్లు అటవీ అధికారులు గుర్తించారు. గ్రామం శివారులోని మామిడి తోటలో చిరుత పులి అడుగుజాడలు ఉన్నట్లు తోట కాపలాదారు గుర్తించి అటవీ శాఖ అధికారులకు సమాచారం తెలిపినట్లు తెలిసింది. దాంతో అటవీ అధికారులు, సిబ్బంది గ్రామాలలో టంకా వేయించారు. పులిగుండాల అటవీ ప్రాంతం పెనుబల్లి, కల్లూరు, జూలురుపాడు, భద్రాద్రి జిల్లా చంద్రుగొండ మండలాల్లో విస్తరించి ఉంది. శుక్రవారం పెనుబల్లి తహశీల్దార్ ప్రతాప్, తల్లాడ రేంజ్ అధికారిని ఉమ, పెనుబల్లి ఎంపీడీఓ అన్నపుర్ణ, బీట్ అధికారి భరత్ బృందం ఆ ప్రాంతాన్ని పరిశీంచారు. చిరుత అడుగులను గుర్తించి నిర్ధారించారు. పులిగుండాల ప్రాజెక్ట్ ప్రాంతానికి గుంపులుగా రావాలని కూలి పనులకు వచ్చే కూలీలు, రైతులు విడివిడిగా రావొద్దని ప్రజలకు తెలిపారు. రాత్రి సమయంలో అసలు బయటకు ఒంటరిగా రావొద్దని తెలిపారు. పాఠశాల విద్యార్థులకు రేపు ఆదివారం మాత్రమే అనుమతి ఉందని అన్నారు. చిరుత పులి సంచరిస్తున్నట్లు జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చినట్లు అధికారులు తెలిపారు.

## మధిర ఎఎంసి చైర్మన్ బండారుకు ఘనసన్మానం



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** మధిర మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన బండారు నర్సింహారావును సత్యనారాయణపురం గ్రామ కమిటీ తరుపున గ్రామ అధ్యక్షులు శీలం వరప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. నూతనంగా మధిర మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సీనియర్ నాయకులు బండ్ల ఆత్మ ప్రసాద్, చెట్ల శివయ్య, రామచంద్రరావు, పిచ్చయ్య, పిట్టల నర్సింహారావు, కృష్ణారావు, ఏసురత్నం, నక్క వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలి




**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాల డిమాండ్ చేస్తూ శుక్రవారం కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐపీకే ఎంఎస్ జిల్లా కార్యదర్శి అమర్లపూడి రామ మాట్లాడుతూ, ఉపాధి హామీ పనులు జిల్లాలో ప్రారంభమవుతున్నాయని అయితే ఉపాధి హామీ కూలీలు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఉపాధి పనులకు వచ్చేవారు ఎక్కువగా వ్యవసాయ కార్మికులే ఎండాకాలంలో వ్యవసాయ పనులు దొరకనందున పేద ప్రజలు ఉపాధి హామీని నమ్ముకుని జీవిస్తున్నారని అన్నారు. అయితే పని ప్రదేశాలలో మంచినీరు, నీడ మెడికల్ కిట్లు ,తదితర కనీస సౌకర్యాలు లేనందున తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. అంతేకాకుండా పార, గడ్డపార తట్టలు, తదితర పనిముట్లు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు అని చెప్పారు. మరి కొంతమంది రోజులు పూర్తి చేసుకొని మిగతా రోజులు ఏ పనులకు వెళ్లాలో అర్థం కాక ఆందోళనకు గురవుతున్నారు. కనుక ప్రభుత్వం సంవత్సరానికి 200 రోజులు పని దినాలు కల్పించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కొలతలతో సంబంధం లేకుండా 600 రూపాయలు కూలి చెల్లించాలని ఉపాధి పనులకు కేటాయించిన నిధులను ఉపాధి పనులకే ఖర్చు చేయాలని అన్నారు. అలాగే పాత బకాయిలను వెంటనే చెల్లించాలని అన్నారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతి పత్రంను కలెక్టరేట్ లో సంబంధిత శాఖ అధికారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు బుర్రవెంకన్న పోతుగంటి లక్ష్మణ్, ఎస్.వెంకటేశ్వరరావు, సాయి తదితరులు పాల్గొన్నారు.

# ఆస్పత్రికి వచ్చే రోగుల పట్ల మర్యాదపూర్వకంగా నడుచుకోవాలి






**-వైద్యులు సమయపాలన పాటించాలి**
**-ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి బి రాహుల్**

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** మారుమూల ప్రాంత పీహెచ్‌సీలలో పని చేసే వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగుల పట్ల మర్యాదపూర్వకంగా నడుకోవాలని ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి బి రాహుల్ అన్నారు. శుక్రవారం మండలంలోని మోరంపల్లిబంజర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలోని ఓపి, డెలివరీ, మందులకు సంబంధించిన రికార్డులను పరిశీలించి రోగులకు అందిస్తున్న వైద్య సౌకర్యాల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ మార్పు వలన వైరల్ జ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది సమయపాలన పాటించి ఆసుపత్రికి వచ్చే రోగులకు సరైన వైద్య సౌకర్యం అందించాలన్నారు. పీహెచ్‌సికి వచ్చే రోగులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి పీహెచ్‌సిలోనే సరైన వైద్యం అందించేలా చూడాలని తెలిపారు. రోగనిర్ధారణ పరీక్షల కొరకు బయట ల్యాబ్‌లకు ఎవరిని రెఫర్ చేయకూడదని, రోగ నిర్ధారణ పరీక్షలు కూడా పీహెచ్‌సిలోనే చేయాలని, ప్రైవేటు ఆసుపత్రిలకు వెళ్ళమని ఎవరిని ప్రోత్సహించకూడదని, రోగుల పట్ల వైద్య సిబ్బంది దురుసుగా ప్రవర్తించకూడదన్నాను. గర్భిణీ స్త్రీల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, సిజేరియన్ ఆపరేషన్ కాకుండా నార్మల్ డెలివరీల సంఖ్య పెరగాలని, ఆసుపత్రిలో పాము కాటు, కుక్క కాటు, ఇతర జబ్బులకు సంబంధించిన మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు బయట మందులు కొనుగోలు కొరకు ఎవరిని పంపకూడదని తెలిపారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్‌వో చైతన్య, పీహెచ్‌సి వైద్యురాలు సాహితి, మధుబాట, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కోటి లింగాల జాతర దుకాణాల కోసం వేలం పాట



**ప్రజాపక్షం/కారేపల్లి:** మహాశివరాత్రి మహోత్సవాన్ని పురస్కరించుకొని, భక్తుల రద్దీకి అనుగుణంగా కోటిలింగాల జాతరలో వివిధ వ్యాపా ర దుకాణాలను ఏర్పాటు చేసేందుకు ఫిబ్రవరి 9వ తేదీన వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ వెంకటేశ్వర్లు తెలిపారు.

**భక్తుల విశ్వాసానికి కేంద్ర బిందువైన కోటిలింగాల జాతర....**

సింగరేణి మండలం పోలంపల్లి గ్రామ పంచాయితీ పరిధిలోని కోటిలింగాల జాతర మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఫిబ్రవరి 26 నుండి మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా జరగనుంది. హర హర మహాదేవ్ అంటూ వేలాది భక్తులు తరలివచ్చే ఈ పవిత్ర సందర్భంలో భక్తుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక దుకాణాల ఏర్పాటు కోసం ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది.

**వేలం పాట వివరాలు....**

భక్తులకు అవసరమైన కొబ్బరికాయలు, లడ్డూ ప్రసాదాలు, కొబ్బరి చిప్పల, ఇతర డెలప్మెంట్ వ్యాపారాల కోసం ప్రత్యేకంగా ఫిబ్రవరి 9వ తేదీ ఉదయం 10గంటలకు ఆలయంలో వేలం పాల నిర్వహించనున్నారు...

**ఆసక్తి ఉన్న వ్యాపారులు పాల్గొనండి...**

ఈ పవిత్ర శివరాత్రి ఉత్సవాలలో భాగస్వామ్యం కావాలని కోరుకునే వ్యాపారులు వేలం పాటలో పాల్గొని, తమ దుకాణాలను పొందే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆలయ కమిటీ కోరారు. శివుని అనుగ్రహం కోరుకునే భక్తులకు ఈ కోటి లింగాల జాతర ఒక దైవిక సందర్భం, శివనామస్మరణతో, ఆధ్యాత్మిక శోభతో జరగనున్న ఈ మహోత్సవానికి హాజరై, భక్తి భావంతో కాలక్షేపం చేయాలని ఆలయ కమిటీ పిలుపునిచ్చింది.

## సాయి ఎక్సలెంట్ స్కూల్‌లో యోగా శిక్షణ



**ప్రజాపక్షం/జూలూరుపాడుః** మండల కేంద్రమైన జూలూరుపాడులో పాపకొల్లు రోడ్ లోగల సాయి ఎక్స్ లెంట్ స్కూల్ నందు శుక్రవారం ఆయుష్ వారి ఆధ్వర్యంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుష్ యోగ ట్రైనర్ ప్రమీల మాట్లాడుతూ పిల్లలు మరియు పెద్దలు ప్రతిరోజు యోగా చేయడం వల్ల మెరుగైన ఏకాగ్రత ఏర్పడుతుందని అన్నారు. ధ్యానం వలన మానసిక ఒత్తిడి తగ్గటంతో పాటు ప్రశాంతంగా ఉండడానికి సహాయ పడుతుందని తెలిపారు. అదే విధంగా మానసిక దృఢత్వానికి, సంపూర్ణ ఆరోగ్యానికి యోగా ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. అంతే కాకుండా రోజు వారి యోగా వలన మెదడు పనితీరు మెరుగుపడుతుందని, రక్త రక్త పోటు తగ్గటం, ఊపిరితిత్తులు సామర్థ్యం కూడా మెరుగుపడుతుందని తెలిపారు. యోగా మానసిక ఆందోళనను తగ్గించడంతోపాటు దీర్ఘకాలిక వెన్నునొప్పిని తగ్గిస్తుందని, మధుమేహ వ్యాధిగ్రస్తులలో రక్తంలో చక్కెరను తగ్గిస్తుందని తెలిపారు. బరువు తగ్గడం, గుండెజబ్బుల ప్రమాదాన్ని కూడా తగ్గించడానికి యోగా ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ నేటి తరానికి యోగా ఎంతో అవసరం అన్నారు. యాంత్రిక జీవితంలాగా ప్రతి విద్యార్థిపై చదువుపై ఎక్కువ శ్రద్ధ చూపిస్తూ వ్యాయామానికి ప్రాధాన్యత ఇవ్వడం లేదని, దీంతో చిన్నతనం నుంచే గ్యాస్ ట్రబుల్, అనారోగ్య సమస్యలకు ఎక్కువ గురవుతున్నారని, దీన్ని దృష్టిలో ఉంచుకుని యోగా కార్యక్రమాలు సాయి ఎక్స్ లెంట్ నందు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# పల్లెల్లో కుంటుపడుతున్న అభివృద్ధి..!

**నిలిచిన కేంద్ర ఆర్థిక సంఘం గ్రాంట్స్**




**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించకపోవడంతో పల్లెలు ప్రగతికి నోచుకోవడం లేదు. గ్రామాల అభివృద్ధికి అత్యధికంగా నిధులు ఇస్తున్నామని పాలకుల హామీలు ఉపన్యాసాలకే పరిమితం అయ్యాయి. పంచాయతీలలో పనులు చేసేందుకు కూడా నిధులు కరువయ్యాయి. కనీస వసతులు కల్పించడంలో నానా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సర్పంచ్ లు పదవి కాలం ముగిసిపోయి, ప్రత్యేక అధికారులు రావడం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రాకపోవడంతో పంచాయతీలలో కార్మికులకు జీతాలు ఇచ్చే పరిస్థితి కూడా లేదు. నిధుల లేక, పనులు చేయించలేక పంచాయతీ కార్యదర్శులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇక కొత్తగా పంచాయతీలుగా ఏర్పడిన తండాలలో అయితే ట్రాక్టర్ కిస్తీలు కట్టే పరిస్థితి కూడా లేకుండా పోయింది. మండలంలోని 32 పంచాయతీల్లో 2, 3 పంచాయతీలు మినహా అన్ని గ్రామాల్లో నిధుల కొరత ఏర్పడింది. మండలంలో రెండు, మూడు గ్రామాలు మాత్రమే ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంది. కేంద్ర ప్రభ్వుత్వం ఇచ్చే నిధులతోనే ఇప్పటివరకు నెట్టుకొచ్చారు. 6 నెలల పైగా కేంద్రం ఆర్థిక సంఘం నిధులను పంచాయతీలకు విడుదల చేయకపోవడంతో దయనీయ పరిస్థితి నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం వాటా అయితే గత ప్రభుత్వ హయాంలోనే నిలిపివేయగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాది కాలం పూర్తి అయిన ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. రాష్ట్రం నుం చి రావాల్సిన నిధులు ఏడాది నుంచి రావడం లేదు. దీంతో ఏం చేయాలో పాలు పోని స్థితిలో అధికారులు కొటుమిట్టాడుతున్నారు. సర్పంచ్ లు వారి పదవి కాలంలో అప్పులు తెచ్చి మరి అభివృద్ధి పనులు చేయించారు. అవి ఇప్పటి వరకు మంజూరు కాకపోవడంతో మాజీ సర్పంచ్ లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**నెలవారీ బిల్లులకు...**

పంచాయతీలో ప్రతి నెల పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్ లకు జీతాలు, ట్రాక్టర్ ల కిస్తీలు, విద్యుత్ దీపాల మరమ్మతులు, విద్యుత్ బిల్లులు, తాగునీటి పైపుల మరమ్మతులు తదితర పనులకు కచ్చితంగా బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. అయితే మండలం లో దాదాపు 3 వంతుల పంచాయతీల్లో సాధారణ నిధులు రూ.10 వేలు లేకపోవడంతో సదరు బిల్లులు చెల్లించలేక చేతులు ఎత్తేశారు.

**బ్లీచింగ్ కు ఇబ్బందులు...**

వీధులలో బ్లీచింగ్ పౌడర్ చల్లడానికి కూడా పంచా యతీల్లో చిల్లి గవ్వ కూడా లేదు. కొన్ని గ్రామాల్లో మాజీ సర్పంచే బాధ్యతలు చూస్తున్నారు. ఇప్పటికీ చిన్న చిన్న పనులు వారే చేయిస్తున్నారు. మరోవైపు ప్రత్యేక అధికారులుగా బాధ్యతలు చేపట్టి కనీసం గ్రామాల వైపు తిరిగి చూడడం లేదు. గ్రామాలలో నెలకొన్న సమస్యల పరిష్కారంపై దృష్టి సాధించడం లేదు.

**బిల్లులు రాలేదు : పెద్దపాక గురవమ్మ, మాజీ సర్పంచ్, భైరవునిపల్లి**



గత ప్రభుత్వ హయాంలో గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేశాం. పల్లె పకృతి, క్రిడా మైదానం, స్మశాన వాటికలు, డంపింగ్ యార్డుల పనులు చేశాం. అయినా నిధులు విడుదల చేయలేదు. ఇప్పటికీ 50 శాతం బిల్లులుఅందలేదు.

## ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొన్న మెచ్చా



**ప్రజాపక్షం/దమ్మపేటః** అశ్వారావుపేట నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు శుక్రవారం దమ్మపేట మండలంలో జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా గుత్తావారిగూడెం గ్రామంలో మల్లాది దుర్గయ్య మనవడు, మల్లాది వెంకటేశ్వరరావు కుమారుడు వంశీ వివాహ వేడుకలో పాల్గొని నవ దంపతులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పట్వారిగూడెం గ్రామంలో శ్రీశ్రీశ్రీ అన్నపూర్ణేశ్వరి సహిత కాశీవిశ్వేశ్వర స్వామి వారి మరియు వేదమాత శ్రీ గాయత్రి అమ్మవారు సృష్టికర్త విరాట్ విశ్వకర్మ భగవానుడు, నవగ్రహ సుబ్రహ్మణ్య, దుర్గాదేవి, ధ్వజ స్థంబ ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మెచ్చాను సత్కరించారు. అనంతరం మెచ్చా అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు దారా యుగంధర్, అంకత ఉమ మహేశ్వరరావు, మాజీ సర్పంచ్ రూప్ సింగ్, చక్రధర్ రావు, చంద్రశేఖర్ రావు, రెడ్డిమళ్ళ నాగయ్య, యట్ల వెంకమ్మ, నాగేంద్ర, తట్టుకోళ్ల సత్తి బాబు, గంగరాజు తదితరులు ఉన్నారు.

## క్షయ నిర్మూలన లక్ష్యంతోనే నిక్షయ్ శివిర్ ప్రణాళిక





**ప్రజాపక్షం/పినపాకః** క్షయ (టీబీ) మహమ్మారికి చెక్‌పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యురాలు దుర్గాభవాని తెలిపారు. నిక్షయ్ శివిర్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని ఏలిచిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2025 సంవత్సరం పూర్తయ్య నాటికి దేశంలో వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా ముందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సాగుతున్నాయని తెలిపారు. క్షయ అంటువ్యాధి కావడంతో ఒకరి నుంచి మరొకరికి సోకకుండా ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం నిక్షయ్ శివిర్ కార్యక్రమానికి శ్రీ కారం చుట్టిందని, ఇందుకు 100 రోజుల ప్రణాళిక తయారు చేసిందని తెలిపారు. ప్రత్యేకంగా ఎక్స్‌రే ద్వారా చెస్ట్ పరీక్షలు కూడా నిర్వహించినట్లు తెలిపారు. టీబీ మహమ్మారి ఒకరి నుంచి మరొకరికి గాలి ద్వారా వ్యాప్తి చెందుతుందని, చాలామంది పరీక్షలు చేసుకునేందుకు ముందుకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు, వారితో సఖ్యతగా ఉన్నవారికి సోకుతుందన్నారు. ఈ వ్యాధి ముదిరితే మరణాలు సంభవించే అవకాశాలున్నాయన్నారు. మందులు సకాలంలో వాడితే ఆరునెలల్లోపు వ్యాధి నయమవుతుందన్నారు. ఇందులో రెండు రకాల వ్యాధి ఉండగా, ఊపిరితిత్తులకు వచ్చిన వ్యాధి ఒకరి నుంచి మరొకరికి సోకుతుంది. ఇతర శరీర భాగాలకు వచ్చిన టీబీ విస్తరించకుండా ఉంటుందన్నారు. వెంట్రుకలు, గోళ్లు మినహా అన్ని భాగాలకు టీబీ వ్యాపిస్తోందని ప్రజలకు హామీ అవగాహన కల్పించారు. ఈ వైద్య శిబిరంలో ఎక్స్ రే టెక్నీషియన్ లహరి, టీబి అలర్ట్ ఇండియా ఎన్జీవో వెంకటేశ్వర్లు, టీవీఎస్టిఎస్ సీనియర్ ట్రీట్మెంట్ సూపర్వైజర్ ప్రేమ్ కుమార్, ఎమ్మెల్యే హెచ్ పి సుష్మ, రామరాజు, ఏఎన్ఎంలు ఈశ్వరి, నాగలక్ష్మి , హెల్త్ అసిస్టెంట్లు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల హక్కుల కోసం పోరాడుదాం



**ప్రజాపక్షం/మణుగూరుః** మణుగూరు తహశీల్దార్ కార్యాలయంలో భూసేకరణపై ప్రజాభిప్రాయ సేకరణ సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశానికి భూసేకరణ అధికారి అండ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుమ మేడం, సింగరేణి అధికారులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, భూసేకరణ బాధిత రైతులు హాజరయ్యారు. రామానుజవరం, తీరలాపురం, మణుగూరు గ్రామాల భూములు సింగరేణి సంస్థకు ప్రభుత్వం అప్పగించాలని యోచిస్తున్న నేపథ్యంలో, భూమిని కోల్పోతున్న రైతులు తమ హక్కుల కోసం గళమెత్తారు.ఈ సమావేశంలో తీరలాపురం మాజీ సర్పంచ్ పాయం కామరాజు, రామానుజవరం మాజీ సర్పంచ్ బాడీష సతీష్ రైతుల తరపున గట్టిగా నిలబడి, న్యాయం కోసం డిమాండ్ చేశారు.

## బతికుండానే ఎల్ఐసి డెత్‌క్లయిమ్

**-పంపకాలలో తేడా రావడంతో బయటపడిన వైనం**

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ఎల్ఐసి కార్యాలయంలో జరిగిన సంఘటన పూర్తిగా పద్ధతి ప్రకారం జరిగి ఉండొచ్చు. ఐతే వినియోదారుల సౌకర్యార్థం ఎల్ఐసి ఇచ్చిన వెసులుబాటు అంటే 5 సంవత్సరాలు క్రమం తప్పకుండా ప్రీమియం కడితే ఎంక్వయిరీ లేకుండా ఖచ్చితమైన డెత్ సర్టిఫికెట్ ఆధారముగా నామినీకి క్లెయిమ్ ఇచ్చే పద్ధతిని వినియోగించుకొని కొంత మంది ఏజెంట్స్ కలసి, మనిషి బ్రతికుండగానే డెత్ సర్టిఫికెట్‌ను అనైతిక పద్ధతిలో సంపాదించి ఈ సంఘటనకు పాల్పడ్డారు. ఈ విషయం శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సారపాక భాస్కర్‌నగర్‌కు చెందిన భూక్య శ్రీరాములు అనే వ్యక్తి బతికుండగానే చనిపోయినట్లుగా దొంగ డెత్ సర్టిఫికెట్ సృష్టించి సుమారు 10లక్షల ఎల్ఐసి బీమా సొమ్మును కాజేశారు. భాస్కర్‌నగర్‌కు చెందిన శ్రీరాములు బతికుండానే చనిపోయినట్లుగా కుక్కునూరు నుండి డెత్ సర్టిఫికెట్ సృష్టించారు. శ్రీరాములు చనిపోయినట్లుగా ఆరు నెలల క్రింత ఎల్ఐసి ఆఫీస్‌లో డెత్ సర్టిఫికెట్ అందజేసి రూ 10లక్షల సొమ్మును రెండు నెలల క్రింత తీసుకున్నారు. ఇందులో ఐదున్నతర లక్షలు ఎల్ఐసి ఏజెంట్‌కు, రూ 3.50లక్షలు భూక్య శ్రీరాములు కుటుంబం, మరో లక్షల రూపాయాలు ఇంకో వ్యక్తి తీసుకున్నారు. ఆలస్యంగా వ్యవహారం వెలుగులోకి రావడంతో ఎల్ఐసి అధికారులు గురువారం విచారణ చేపట్టారు. బీమా సొమ్మును కాజేసిన వారి నుండి రికవరీ చేశారు. ఈ వ్యవహారంపైపూర్తి స్థాయి విచారణ చేస్తున్నట్లు ఎల్ఐసి అధికారులు తెలిపారు. ఈ సంఘటనకు కారకులైన ఏజెంట్స్‌ను బ్రతికుండగానే డెత్ సర్టిఫికెట్ ఇచ్చిన వ్యవస్థ లోని చీడ పరుగులను శిక్షించాలని సంస్థ తద్వారా ప్రజల సొమ్ముకి రక్షణ కల్పించాలని పలువురు ప్రజాసంఘాలు ఎల్ఐసి వినియోగదారులు కోరుతున్నారు. అంతే కాకుండా నిజమైన సర్వీస్ ఇచ్చే ఏజెంట్లను ప్రోత్సాహంచే విధంగా ఎల్‌సిఐకి ఆపఖ్యాతి రాకుండా చూడాల్సిన బాధ్యత అటు యాజమాన్యంపై ఉన్నది. తప్పు చేసిన వారిని ఉపేక్షించకుండా పూర్తి కాలం వారిని టెర్మినేట్ చేయడమే కాకుండా భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా ఎల్ఐసి యాజమాన్యం గట్టి చర్యలు తీసుకోవాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు.

## వివాహ వేడుకలో పాల్గొన్న తాటి



**ప్రజాపక్షం/ములకలపల్లి:** మండల పరిధిలోని పాతగంగారం గ్రామంలో తాటి వీర భద్రం కుమారుడు నవీన్ వివాహ వేడుకలో బూర్గంపాడు, అశ్వారావుపేట మాజీ ఎంఎల్ఏ, తెలంగాణ రాష్ట్ర మాజీ ట్రైకర్ ఛైర్మన్ తాటి వెంకటేశ్వర్లు హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించి, నూతన వస్త్రాలను అందజేశారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ బైటి రాజేష్, బుల్లబ్బాయి, మరీదు, బజ్జూరి చిన్నబ్బాయి, తాటి రవి, తాటి చిన్నవెంకటేశ్వర్లు, తాటి చంద్రం, తాటి రవి, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీల్లో సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/ములకలపల్లి:** గ్రామ పంచాయితీలలో నెలకొని వున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు గౌరి నాగేశ్వరరావు డిమాం డ్ చేశారు. శుక్రవారం ఆ సంఘం ఆధ్వర్యంలో గ్రామ పంచాయితీలో సమస్యలు పరిష్కరించాలని ప్రదర్శనగా వెళ్లి డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయితీలలో అనేక సమస్యలతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, గ్రామ పంచాయితీకి వెంటనే నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. గ్రామ సభలో ప్రకటించిన అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఆత్మీయ భరోసా, పింఛన్లు, రేషన్ కార్డులను ఇవ్వాలన్నారు. ఈకార్యక్రమంలో రాజనేని రాజు, రావుల పుల్లయ్య, కాకర్ల సుధాకర్, సాయి కిరణ్, గౌరి లక్ష్మీ , సత్యవతి, భవాని, సమ్మక్క, బతుకమ్మ,పాల్గొన్నారు.

# కార్మికుల సంక్షేమమే ధ్యేయం

**-సింగరేణి జిఎం షాలెం రాజు**
**-పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** కార్మికుల సంక్షేమం, వారి అభివృద్ధి తమకు ధ్యేయమన్నారు సింగరేణి కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలేం రాజు. శుక్రవారం సత్తుపల్లి పట్టణ, సింగరేణి పరిధిలో పలు అభివృద్ధి, సంక్షేమ పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు కార్యక్రమాలు నిర్వహించారు జిఎం షాలెం రాజు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ సహకార, చేనేత జౌళి శాఖమాత్యులు తుమ్మల నాగేశ్వరరావు, సత్తుపల్లి నియోజకవర్గ శాసన సభ్యురాలు డా. మట్టా రాగమయిల సలహా, సూచనలపై సత్తుపల్లి ఏరియాలోని అర్బన్ పార్క్ నందు వీధి కుక్కల బారి నుండి దుప్పులను రక్షించుట కొరకు, దుప్పుల సంరక్షణార్థం అర్బన్ పార్క్ చుట్టూ రూ.కోటి రూపాయల వ్యయంతో ఫెన్సింగ్ నిర్మాణ కార్యక్రమమునకు శంకుస్థాపన చేశామన్నారు. అదే విధంగా జేవిఆర్ ఓసి నందు రూ.10లక్షల వ్యయంతో నిర్మించిన డంపర్, డోజర్ వాహనాల బ్యాటరీ చార్జింగ్ రూమ్ ను ప్రారంభించుకోవటం సంతోషంగా ఉందని, జేవిఆర్ డిస్పెన్సరీ నందు రూ. 35 లక్షల వ్యయంతో అధునాతనమైన నూతన డిజిటల్ ఎక్సరే మిషన్ ను ప్రారంభించామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జే.వి.ఆర్.ఓ.సి కు నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను రక్షణతో సాధించాలన్నారు. సత్తుపల్లిలో పనిచేయుచున్న ఉద్యోగులు ఆర్థోపెడిక్ (ఎముకల) అనారోగ్య ఎక్సరే కొరకు సత్తుపల్లి నుండి కొత్తగూడెం మెయిన్ హాస్పిటల్ కు వెళ్ళుటకు ఇబ్బంది అవుతుందని వారి సౌకర్యార్థం ఈ అధునాతనమైన నూతన డిజిటల్ ఎక్సరే మిషన్ ను జేవియర్ డిస్పెన్సరీ నందు ఏర్పాటు చేశామని తెలిపారు. ఉద్యోగస్తుల సంక్షేమ కార్యక్రమాల నందు సింగరేణి సంస్థ ఎప్పుడు ముందు వరుసలో ఉంటుందని మరోసారి గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఏరియా ఏఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ సముద్రాల సుధాకర్, ఐఎన్టియుసి వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్, సత్తుపల్లి ఏరియా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ స్నేహాలత, జె.వి.ఆర్.ఓసి ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎన్.వి.ఆర్ ప్రహ్లాద్, ఎజిఎం(సివిల్) సిహెచ్ రామకృష్ణ, కిష్టారం ఓసి ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎం.వి.నరసింహారావు, ప్రాజెక్ట్ ఇంజనీర్ డి శ్రీనివాస్, జేవిఆర్ ఓసి ఫిట్ సెక్రటరీలు నరసింహారావు, రామారావు, జే.వి.ఆర్. ఓసి సీనియర్ పిఓ కే దేవదాస్, సివిల్ సంబంధిత అధికారులు రవికుమార్, నవీన్, రవీందర్ మరియు ఇతర ఉన్నతాధికారులు, యూనియన్ ప్రతినిధులు, ఫారెస్ట్ డిపార్ట్మెంట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## కన్నులవిందుగా సీతారాముల ఆలయ పునఃప్రతిష్ఠామహోత్సవం




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పట్టణంలోని అయ్యగారిపేటలో గల సీతారామ చంద్రస్వామి వారి ఆలయ పునః ప్రతిష్ట మహోత్సవం శుక్రవారం కన్నుల విందుగా ఆలయ కమిటీ బాధ్యతలు నిర్వహించారు. గత వారం రోజులుగా సీతారామచంద్ర స్వామి దేవాలయ ప్రతిష్ట వేడుకలకి సంబంధించిన కార్యక్రమాలు జరగ్గా, చివరి రోజు ధ్వజస్తంభం, ఉత్సవమూర్తులను పట్టణంలో ఊరేగించి శాస్త్రోక్తంగా ప్రతిష్టించారు.

**రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డా.మట్టాను ఘనంగా సన్మానించిన ఆలయ కమిటీ...**

అయ్యగారి పేటలో జరిగిన సీతారామచంద్ర స్వామి ఆలయ పున ప్రతిష్ట వేడుకలకు రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డా. మట్టా దయానంద్ విజయ్ కుమార్ హాజరై స్వామి వారికి జరిగిన ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ బాధ్యులు, అర్చకులు దయానంద్ కు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఘనంగా సన్మానించారు. అనంతరం హాజరైన భక్తులకు ఏర్పాటు చేసిన అన్నప్రసాదాన్ని దయానంద్ ప్రారంభించారు.





**ప్రత్యేక పూజలు చేసిన మాజీ శాసన సభ్యులు సండ్ర...**

సీతారామచంద్రస్వామి ఆలయ పున ప్రతిష్ట వేడుకలకు సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు, బిఆర్ ఎస్ నాయకులు సండ్ర వెంకట వీరయ్య హాజరై, ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ బాధ్యులు సండ్రకు ఘన స్వాగతం పలికి, శాలువాతో ఘనంగా సన్మానించారు. సీతారామచంద్ర స్వామి ఆశీస్సులు తీసుకున్న టీజీఐడిసీ చైర్మన్ మువ్వా సీతారామచంద్రస్వామి దేవాలయ ప్రతిష్టా మహోత్సవంలో టీజీఐడిసి చైర్మన్ మువ్వా విజయబాబు పాల్గొని, స్వామివారిని దర్శించుకుని, స్వామి వారి ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమానికి హాజరైన మువ్వాకు ఆలయ కమిటీ బాధ్యులు పూర్ణ కుంభం తో స్వాగతం పలికి, ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దయానంద్ అభిమానులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మాజీ శాసనసభ్యులు సండ్ర అభిమానులు, టిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు. టీజీ ఐడిసి చైర్మన్ మువ్వా, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అభిమానులు, ప్రజలు భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

## సింగరేణిలో మారుపేర్లు, విజిలెన్స్ బాధితుల సమస్యను పరిష్కరించండి

**ఏఐటియుసి కేంద్ర ఉపాధ్యక్షులు వంగా వెంకట్**

**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** సింగరేణి లో మారుపేర్లు, విజిలెన్స్ బాధితులు తమ సమస్యల పరిష్కారం కోసం గోలేటి నుండి కొత్తగూడెం వరకు కొనసాగుతున్న పాదయాత్ర కు గుర్తింపు సంఘం ఏఐటియుసి మద్దతు తెలుపుతుందని, వారి సమస్య పరిష్కారం త్వరలో జరిగే సి అండ్ ఎండి లెవెల్ మీటింగ్ లో ఏఐటియుసి డిమాండ్ చేస్తోందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి కేంద్ర ఉపాధ్యక్షులు వంగ వెంకట్ పేర్కొన్నారు. శుక్రవారం కొత్తగూడెం హెడ్ ఆఫీస్ ముందు జరిగిన సింగరేణి మారుపేర్లు, విజిలెన్స్ బాధితుల తమ ఉద్యోగాలను వన్ టైం సెటిల్మెంట్ కింద పరిష్కరించాలని కోరుతూ గోలేటి నుండి కొత్తగూడెం వరకు జరిగిన పాదయాత్ర ముగింపు సందర్భంగా జరిగిన ధర్నా లో ఆయన పాల్గొని మాట్లాడుతూ. సింగరేణి మారుపేర్లు, విజిలెన్స్ బాధితులు గత కొన్ని సంవత్సరాలుగా అనేక ఆందోళన కార్యక్రమాలు చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం, యాజమాన్యం సమస్య పరిష్కారం కోసం చొరవ చూపకపోవడం విచారకరమని ఆయన అన్నారు. ఉద్యోగాలు రాక, డబ్బులు , పెన్షన్లు రాక, బాధితుల కుటుంబాలు అనేక ఆర్థిక ఇబ్బందుల్లో పడ్డారని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో భూపాలపల్లి లో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇట్టి సమస్యను అధికారం లోకి రాగానే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని అన్నారు. అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచిన ఇంత వరకు వారి సమస్యను పరిష్కరించడం లో వైఫల్యం చెందారని ఆయన విమర్శించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం




వీరి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి నాటి ప్రభుత్వం విస్మరించిందని తెలిపారు. ఇప్పటికైనా కోల్ బెల్ట్ ఎమ్మెల్యేలు స్పందించి సింగరేణి కార్మికుల సమస్యలనురాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మారుపేరు బాధితులకు, అదేవిధంగా విజిలెన్స్ బాధితులకు తక్షణమే సింగరేణి లో ఉద్యోగాలు ఇచ్చే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. వీరి పోరాటానికి ఏఐటియుసి మద్దతు తెలుపుతుందని, త్వరలో జరిగే సి అండ్ ఎండి లెవెల్ మీటింగ్ లో వీరి సమస్యను పరిష్కరించాలని ఏఐటియుసి డిమాండ్ చేస్తోందని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం డిమాండ్ లతో కూడిన వినతిపత్రాన్ని సింగరేణి హెడ్ ఆఫీస్ లో ఉన్న అధికారులకు పాదయాత్ర లో పాల్గొన్న బాధితులతో కలిసి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి సీనియర్ నాయకులు డి.శేషయ్య,వీరాస్వామి, ఎస్వి రమణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఛత్తీస్‌గడ్‌లో సర్పంచ్ అభ్యర్థిని హత్యచేసిన మావోయిస్టులు

**ప్రజాపక్షం/భద్రాచలం :** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మావోయిస్టులు మరో సారి ఘాతుకానికి పాల్పడ్డారు. ఆ రాష్ట్రంలో దంతెవాడ జిల్లా అరణ్‌పూర్ పంచాయితీ సర్పంచ్ అభ్యర్థిగా భరిలో ఉన్న జోడా బస్సేను గురువారం అర్థరాత్రి తన ఇంట్లోని కుటుంబీకుల ముందు గొంతుకోసి హత్య చేశారు. కుటుంబీకులు ఎంతవద్దని వారించినప్పటికీ మావోయిస్టులు కిరాతకంగా హతమార్చినటు తెలుస్తోంది. ఇదిలా ఉండగా సిపిఐ మావోయిస్టు పార్టీకి చెదిన హతుడు బస్సే ఇటీవల ఆ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. అరణ్‌పూర్ పంచాయితీ పరిధిలోని సర్పంచ్ అభ్యర్థిగా భరిలో ఉన్నారు.

## ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన కలెక్టర్

**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** శుక్రవారం ఆర్డీవో కార్యాలయం ప్రాంగణంలో ఈవీఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఈవీఎం భద్రతకు సంబంధించి ప్రతినెల తనిఖీ చేయడం జరుగుతుందని అన్నారు. ఇందులో భాగంగా ఈవీఎం గోడౌన్ ను సందర్శించడం జరిగిందని తెలిపారు. ఈ పరిశీలనలో భాగంగా ఈవీఎం, వీవీ ప్యాట్లు ఉన్న గదిని, సీసీ కెమెరా గదిలో కెమెరాల పనితీరును పరిశీలించారు. అనంతరం ఆయన గోడౌన్ పరిసర ప్రాంతంలో పరిశుభ్రంగా ఉంచాలని, అనుమతి లేనిదే ఎవరిని లోపలికి అనుమతించరాదని అధికారులకు సెక్యూరిటీ గార్డ్ కు తెలిపారు. తనిఖీ రిజిస్టర్లు లోసంతకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సూపర్డెంట్లు రంగ ప్రసాద్, ధారా ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.




## 9న ఉచిత క్రియా యోగా ధ్యాన తరగతి

**ప్రజాపక్షం/మణుగూరు:** ఈ నెల 9వ తేదీన ఉచిత క్రియా యోగా ధ్యాన తరగతి ఉదయం 8 నుండి సాయంత్రం 4 గంటలవరకు ఒక్క రోజు ఆదివారం రామానుజవరం (కొండాయిగూడెం) శివాలయం మణుగూరు నందు హిమాలయ క్రియా యోగి (జూన్ అఖాడ)జ్ఞానానంద గిరి మహారాజ్ స్వామీజీచే ఉచిత యోగా ధ్యాన తరగతులు నిర్వహించడం జరుగుతుందని పతంజలి ఆరోగ్య కేంద్రం ఇంద్రారెడ్డి తెలిపారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి అందరిని హృదయ పూర్వకముగా ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఉచిత అన్నప్రసాద వితరణ కలదని తెలిపారు.

## స్వయం శక్తితో ఆర్థికాభివృద్ధి చెందాలి



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆర్థికంగా ఎదగడానికి వడ్డీ లేని రుణాలు అందిస్తూ, చిరు వ్యాపారాలు చేసే సంఘ సభ్యులను ప్రోత్సహిస్తుందని డిఆర్డిఏ ఏపిడి నూరుద్దీన్ అన్నారు. తిరుమలాయపాలెం మండల కేంద్రంలో శ్రీ టీ క్యాంటీన్ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తిరుమలాయపాలెం గ్రామంలోని వెంకటేశ్వర గ్రామ సమైక్యలో గులాబి ఎస్‌హెచ్‌జి సభ్యురాలు ఎస్కే మైబూబ్ ఏర్పాటు చేసుకున్న శ్రీ టి క్యాంటీన్ ఏపీడి నూరుద్దీన్ తాహసిల్దార్ పి.వి. రామకృష్ణ ఏపిఎం కొట్టే వెంకటేశ్వర్లు సమక్షంలో ప్రారంభించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల అభివృద్ధికి వడ్డీ లేని రుణాలు ఇస్తూ మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉందని స్వయం సహాయక సభ్యులు స్వయం శక్తితో ఎదగాలని చిరు వ్యాపారాలు ప్రారంభించి ఆర్థికంగా బలోపేతం కావాలని ఆయన కోరారు.తిరుమలాయపాలెం ఏపీఎం గా కొట్టే వెంకటేశ్వర్లు నూతనంగా బాధ్యతలు చేపట్టి పొదుపు సంఘాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని, ఏపిఎం కొట్టే వెంకటేశ్వర్లని ఆయన అభినందించారు. మండల కేంద్రంలో శ్రీ టి క్యాంటీన్ ను ప్రారంభించడం సంతోషదాయకమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తహాసిల్దార్ పి.వి. రామకృష్ణ, ఏపిఎం కొట్టే వెంకటేశ్వర్లు, ఏపీవో నరసింహారావు, ఐకెపి సిసిలు బండ్ల నాగేశ్వరావు, రేణుక, బెల్లం అనిత, దేవ సుందరం, జయపాల్, రవి, వివో ఏలు సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక కార్యాచరణ



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** రాబోయే వేసవి లో తాగునీటి ఎద్దడిని నివారించేందుకు రక్షిత మంచినీటి విభాగం ప్రత్యేక కార్యచరణ ను రూపొందిస్తున్నట్లు మిషన భగీరథ డీఈఈ ఓం ప్రకాష్ పేర్కొన్నారు. మండలం లోని నాచేపల్లి తో పాటు వివిధ గ్రామాలలో శుక్రవారం తాగునీటి సరఫరా ను పరిశీలించారు. గ్రామాలలో చేతి పంపులు ఎన్ని ఉన్నాయి. ఎన్ని పని చేస్తున్నాయి. త్రీఫేజ్ మోటార్లు నడుస్తున్నాయా లేదా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. బోరు బావుల నుంచి సమృద్ధిగా వస్తుందా లేదా అని తెలుసుకున్నారు. మిషన్ భగీరథ నీరు చేరని చోట అవసరమైన ప్రత్యామ్నయాల పై గురించి ఆరా తీస్తున్నారు. నీటి లభ్యత, పైపులైన్ల లీకేజీ మరమ్మతుల తదితర వివరాలు పంచాయతీ సిబ్బంది ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అవసరమైతే ప్రత్యామ్నాయ చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏఈ లక్ష్మి భవని, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలను పరామర్శించిన మంత్రి పొంగులేటి



ప్రజాపక్షం/బోనకల్‌: మండల కేంద్రంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వరమ్మ కుటుంబాన్ని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం పరామర్శించారు. వరమ్మ చిత్రపటానికి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వరమ్మ కుమారుడు ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రభ రిపోర్టర్ యార్లగడ్డ శ్రీనివాసరావుకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని, అధైర్యపడవద్దని తెలిపారు. రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైనా క్షతగాత్రులు మరీదు ధనలక్ష్మి , మరీదు శైలజ, పెద్దగౌండ్ల వెంకటరమణ,మోర్ల శైలజ, పసల త్రివేణి, గద్దె పుల్లమ్మలను పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. ప్రమాద సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. గాయాలై వైద్యం చేయించుకున్న వారు సిఎం రిలీఫ్ ఫండ్ ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### -పొంగులేటికి జర్నలిస్టుల వినతి



మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి మండల ప్రెస్‌క్లబ్ అధ్వర్యంలో జర్నలిస్టులు ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలని వినతి పత్రాన్ని అందజేశారు. ముందుగా గ్రామానికి చెందిన గుడ్డూరు గోవిందమ్మ, వెంకటేశ్వర్లు వివాహామహోత్సవంలో పాల్గొని వధువరులను ఆశీర్వదించి పట్టు వస్త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు సురభి వెంకన్న, సీనియర్ పాత్రికేయులు తమ్మారపు వెంకటేశ్వర్లు, తేన వెంకటేశ్వర్లు, సభ్యులు రేగళ్ల శ్రీనివాసరావు, ఆకెన పవన్, కాంగ్రెస్ నాయకులు కోట రాంబాబు, దయాకర్‌రెడ్డి, భూక్యా సైదానాయక్, ఉమ్మినేని కృష్ణ, భాగం నాగేశ్వరరావు, బోయినపల్లి మురళి, యూత్ కాంగ్రెస్ నాయకులు భూక్యా భద్రునాయక్, మాజీ వైఎస్ఎంపిపి గుగులోత్ రమేష్ తదితరులున్నారు.

# దివ్యాంగులకు సహాయ ఉపకరణాలు

### -ఎంపిక కొరకు ప్రత్యేక శిబిరాలు
### -కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



ప్రజాపక్షం/ఖమ్మం : జిల్లాలోని దివ్యాంగులకు సహాయ ఉపకరణాలను అందించుటకు ప్రత్యేక ఎంపిక శిబిరాలను ఏర్పాటు చేశామని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10 నుంచి 14 వరకు నియోజక వర్గానికి ఒక శిబిరాన్ని నిర్వహిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఫిబ్రవరి 11న సత్తుపల్లిలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో, 12న మధిర రైతు వేదికలో, 13న వైరా రైతు వేదికలో, 14న పాలేరు అసెంబ్లీ నియోజకవర్గ దివ్యాంగుల శిబిరం గుర్వాయిగూడెం రోడ్డులోని కూసుమంచి రైతు వేదికలో నిర్వహించబడుతుందని తెలిపారు. ఖమ్మం శిబిరం ఫిబ్రవరి 10న ఎన్నెస్పి క్యాంపు రోడ్డులోని రోటరీ క్లబ్‌లో నిర్వహించబడుతుందని కలెక్టర్ తెలిపారు. ప్రత్యేక ఎంపిక శిబిరాలు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు జరుగుతాయన్నారు. వయో వృద్దులకు చేతి కర్రలు, వాకర్స్, వినికిడి యంత్రాలు, శారీరక దివ్యాంగులకు చార్జింగ్ బ్యాటరీతో నడిచే ట్రై సైకిళ్లు, కృత్రిమ అవయవాలు అందించే వారి ఎంపిక జరుగుతుందన్నారు. బ్యాటరీ ఆపరేటర్ ట్రై సైకిల్ పొందెందుకు 16 సంవత్సరాలపైబడి, 80 శాతం వైకల్యం ఉన్న వారు ఏడాదికి రూ.1.80 లక్షల ఆదాయానికి మించని వారు అర్హులన్నారు. దివ్యాంగులు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

# పదిన నులిపురుగుల నివారణ దినోత్సవం



ప్రజాపక్షం/కల్లూరుః ఫిబ్రవరి 10వ తేదీ సోమవారం జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా పాఠశాలలో, కళాశాలలో, అంగన్‌వాడీ కేంద్రాలలో ఉన్న 1 నుంచి 19 సంవత్సరాలు వయసు గల పిల్లలకు, విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు ఉచితంగా ఇవ్వబడుతుందని వైద్యులు నవ్య కాంత్ తెలిపారు. రక్తహీనత తగ్గి పోషణ మెరుగవుతుందని, మెరుగైన మానసిక అభివృద్ధి, శరీరాభివృద్ధి చురుకుతనం, ప్రకాశవంతమైన భవిష్యత్తు అందించేందుకు ఉపయోగపడుతుందని వైద్యులు సూచించారు. కావున సోమవారం రోజున జరిగే ఈ కార్యక్రమంలో పాల్గొని ఉపయోగించుకోవాలని వైద్యులు వివరించారు

# విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు అందించాలి

### - జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్







ప్రజాపక్షం / పాల్వంచ : ఆశ్రమ గురుకుల పాఠశాలలు, వసతి గృహాలలో విద్యార్థులకు అందించే సౌకర్యాలు మెరుగుపరచాలని అధికారులను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశించారు. శుక్రవారం పాల్వంచ ఆశ్రమ గురుకుల వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ డైనింగ్ హాల్, తరగతి గదులు, పరిసరాలు, మరుగుదొడ్లు, వంటగది పరిశీలించారు. పరిశీలనలో భాగంగా కలెక్టర్ విద్యార్థులతో మమేకమై వారికి అందుతున్న ఆహారం మెనూ ప్రకారం అందిస్తున్నారా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ..డార్మెటరీ డోర్లు, కిటికిలు, త్రాగునీటి సమస్యలు, ఎలక్ట్రికల్ సమస్యలు పరిష్కరించడానికి తగిన ప్రణాళిక అందించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. డార్మెటరీ హాల్లో దోమలు రాకుండా జాలి ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రహరీ గోడపై కంచ ఏర్పాటు చేయాలని, దానికి అవసరమైన నివేదికలు సమర్పించాలని అధికారులకు ఆదేశించారు. వసతి గృహాలలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని, నాణ్యత లేని పదార్థాలను ఎట్టి పరిస్థితుల్లో వినియోగించకూడదని ఆదేశించారు. పాఠశాలలు, వసతి గృహాల్లో పరిశుభ్రత పాటించాలని, విద్యార్థుల ఆరోగ్యం అందరి బాధ్యత అని, వారికి మెరుగైన సౌకర్యాలు కల్పించడం ద్వారా విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అవరోదించగలుగుతారని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట డిడి ట్రేబల్ వెల్ఫేర్ మణెమ్మ, పాఠశాల హెడ్మాస్టర్ భద్రు, సిబ్బంది పాల్గొన్నారు.

# నీటి సమస్య నివారణకు ప్రత్యేక ప్రణాళిక



ప్రజాపక్షం/కల్లూరుః కల్లూరులోని ఎంపీడీవో కార్యాలయంలో మిషన్ భగీరథ వాటర్ గ్రిడ్ ఉమ్మడి జిల్లా చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ సమీక్ష కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని కల్లూరు, తల్లాడ, పెనుబల్లి, వేంసూరు, సత్తుపల్లి మండలాల పరిధిలో లోని రాబోయే వేసవిలో మంచినీటి సమస్య లేకుండా తట్టుకునేందుకు ప్రత్యేక ప్రణాళికను చేపట్టినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాలలో ఎలాంటి నీటి సమస్య ఉన్న అధికారులు దృష్టికి తీసుకురావాలని వెంటనే పరిష్కరిస్తామని ఆయన ఈ సమీక్ష సమావేశంలో వివరించారు. పైప్ లైన్ లీకేజీలు మరమ్మత్తులు వెంటనే స్పందించి చేసి నీటిని ప్రజలకు అందిస్తున్నామని పేర్కొన్నారు. గూడూరు వాటర్ గ్రిడ్ నీటి శుద్ధి కేంద్రం నుంచి సరఫరా అవుతున్న నీటిని ప్రతిరోజు పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. మండలాలు పరిధిలోని తమ శాఖ పరిధిలో ఉన్న అధికారులందరినీ ప్రతిరోజు సమీక్ష చేసుకునేందుకు ప్రణాళికలను చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఈ సదాశివ కుమార్, ఈ ఈ వాణిశ్రీ, డి ఇ లు, ఏఈలు, ఎం పి ఓ ఏనుగు సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# సాధారణ ప్రసవాలపై శ్రద్ధ వహించండి

### - ఐటిడిఏ పిఓ రాహుల్



ప్రజాపక్షం/భద్రాచలం : మారుమూల ఆదివాసీ గిరిజన గ్రామాల నుండి ఏరియా ఆస్పత్రికి పేదలు వస్తుంటారని, కాన్పు కోసం వచ్చే గిరిజన మహిళలకు ఆపరేషన్లు కాకుండా సాధారణ ప్రసవాలు జరిగేలా వైద్యులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అన్నారు. శుక్రవారం స్థానిక ఏరియా ఆస్పత్రిని ఆయన తనిఖీ చేశారు. డయాల్సిస్‌సెంటర్, ఓపి, మెటర్నటీ వార్డు పరిశీలించిన ఆయన వైద్య చికిత్సల కోసం వచ్చిన రోగులతో మాట్లాడుతూ అందుతున్న వైద్యంపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం పిఓ మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే రోగులకు అన్ని రకాలు పరీక్షలు ఉచితంగా చేయాలని, సిబ్బంది రోగుల వద్ద నుండి డబ్బులు ఆశించరాదన్నారు. టెస్టుల కోసం ఎవ్వరినీ బయటకు పంపించరాదని, వైద్యులు రోగాలకు అందుబాటులో ఉండాలని, సమయ పాలన పాటించాలని, కాన్పు కోసం వచ్చే మహిళలకు తక్షణ వైద్య సేవలు అందించాలని నిర్లక్ష్యం వహించే వైద్యసిబ్బందిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అబార్షన్ చేయాల్సిన పరిస్థితి తలెత్తినప్పుడు తప్పని సరిగా అనుమతి తీసుకోవాలని, ప్రతీ ప్రసవానికి సంబంధించి ఆన్‌లైన్ చేయాలని, రోగుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. భద్రాచలం పట్టణంలో వివిధ టెస్టుల కోసం అనేక మంది ల్యాబులను ఆశ్రయిస్తున్నారని, వారి ఇష్టాను సారంగా అందిన కాడికిదోచుకుంటున్నారని, దానిపై డిప్యూటీ డిఎంహెచ్ఓ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రంమలో డిప్యూటీ డిఎంహెచ్ఓ డా. చైతన్య, సూపరింటెండెంట్ డా. ముదిగొండ రామకృష్ణ, సంతోష్కుమార్, ఆయూష్ డాక్టర్ వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాపక్షం/కల్లూరుః కల్లూరు మండలం పెద్ద కోరుకొండి విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో 19 గ్రామాలలో 12 వేల మంది వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో శనివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు మరమ్మత్తుల కారణంగా అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ అధికారి శీలం రామిరెడ్డి తెలిపారు. కావున గృహ వినియోగదారులు, వ్యవసాయ, పరిశ్రమలు, వినియోగదారులందరూ గమనించి సహకరించగలరని విద్యుత్ శాఖ అధికారి తెలిపారు.

# నేడు సత్తుపల్లిలో విద్యుత్‌కు అంతరాయం

ప్రజాపక్షం/సత్తుపల్లిః గౌరిగూడెం 33/11 కేవి సభ్ స్టేషన్ మరమ్మత్తుల నిమిత్తం శనివారం ఉదయం 8.30 నుండి 10.30 వరకు సబ్ స్టేషన్ పరిధిలోని గౌరిగూడెం, కొత్తూరు, రేజర్ల, సర్వారాయ, సిద్ధారం మెయిన్ రోడ్, రాజీవ్ నగర్ కాలనీలకు విద్యుత్ అంతరాయం కలుగునని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ శరత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# హెల్మెట్ పెట్టుకో.. ప్రాణాలను కాపాడుకో...



**-హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయవద్దు**
**-మద్యం మత్తులో డ్రైవింగ్ ప్రమాదాలకు కారణం**
**-ద్విచక్ర వాహనదారులు జర జాగ్రత్త**

**ప్రజాపక్షం/వైరా:** ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు చాలామందికి హెల్మెట్ పెట్టుకోవడానికి ఇష్టపడరు. ఎందుకంటే హెల్మెట్ పెట్టుకుంటే జుట్టు చెదిరిపోతుందని, మోయడం భారమని హెల్మెట్ పెట్టుకోవడం లేదు. కొంతమంది ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా నడిపితే ఫైన్ పడుతుందన్న భయంతో హెల్మెట్ పెట్టుకుంటున్నారు. కొంత మంది మాత్రం రోడ్డు ప్రమాణ నిబంధనలను నిబంధనలు పాటిస్తూ ముందు జాగ్రత్తతో హెల్మెట్ పెట్టుకొని ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్నారు. కొంతమంది మాత్రం నిర్లక్ష్యంగా హెల్మెట్ పెట్టుకోకుండానే ద్విచక్ర వాహనాలను నడుపుతున్నారు. పోలీస్ ఆర్‌డివో అధికారులు అవగాహన సదస్సులు నిర్వహించిన ఫైన్ కడతారు. కాని హెల్మెట్ పెట్టుకోవడం లేదు. రోడ్లపై ఎన్నో ద్విచక్ర వాహన ప్రమాదాలు జరిగిన మృతి చెందిన వారిలో మృతులు హెల్మెట్ లేక ప్రాణాలు కోల్పోయిన కనిపిస్తున్నాయి. హెల్మెట్ ప్రాముఖ్యత వివరిస్తూ రోడ్డు భద్రత నియమాలపై రాష్ట్ర రవాణా శాఖ ఆధ్వర్యంలో జాతీయ భద్రతా మాసోత్సవాల్లో భాగంగా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు ఆర్‌టిఏ అధికారులు పోలీసులు నిర్వహిస్తున్నారు. ఫుల్‌గా తాగి వాహనాలు నడిపేవారు ఏదైనా ప్రమాదం జరిగితే వారికే కాకుండా వారితో ద్విచక్ర వాహనంపై వచ్చిన బంధువులకు గాని స్నేహితులు గాని ఇతరులకు గాని రక్షణ ఇవ్వలేకపోతున్నారు.

**హెల్మెట్ వాడకం మీకు మీ కుటుంబానికి ఎంతో శ్రేయస్కరం: సిఐ నునావత్ సాగర్**

ద్విచక్ర వాహనాలు తప్పనిసరిగా వాహనం తోలేటప్పుడు హెల్మెట్ ఉపయోగించాలి. ఎందుకంటే హెల్మెట్ అనేది తలకు పెట్టుకొని ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేస్తే ఎక్కడైనా ఏదైనా ప్రమాదాలు జరిగితే క్రింద పడ్డప్పుడు మన తలకు ఎలాంటి దెబ్బ తగలకుండా ప్రాణాన్ని హెల్మెట్ కాపాడుతుంది. ఎక్కువ శాతం మద్యం మత్తులో వాహనాలు తోలేవారు హెల్మెట్ ఉపయోగించండి, ఆ హెల్మెట్ ప్రమాదం జరిగినప్పుడు మిమ్ములను కాపాడుతుంది. మీ కుటుంబ సభ్యులకు మిమ్మల్ని దూరం చేయకుండా చూస్తుంది. మద్యం సేవించి వాహనాలు నడపడం హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనం నడపడం ఓవర్ చేయడం. నిర్లక్ష్యం అతివేగం నడపడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి అని వైరా సిఐ నునావత్ సాగర్ అన్నారు.




**ప్రతిఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలి : ఎంవిఐ వరప్రసాద్**



ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రోడ్డు రవాణా జాతీయ మాసోత్సవాల్లో భాగంగా పెద్ద ఎత్తున అవగాహన సదస్సులు నిర్వహించడం జరిగింది. పాఠశాలల్లో విద్యార్థులకు ఆటో అడ్డాల్లో ఆటో డ్రైవర్లకు మినీ లారీ ఓనర్లకు ద్విచక్ర వాహనదారులకు ప్రతిఒక్కరూ అవగాహన సదస్సులో హెల్మెట్ యొక్క ప్రాముఖ్యతను వివరించడంతో పాటు సీట్‌బెల్ట్ ధరించాలని కూడా చెప్పడం జరిగింది. కాని అధికారుల మాటలను సమీక్ష సమావేశాలు జరిగిన తీరును పట్టించుకోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయి. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలి. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు హెల్మెట్ మన తలకి ఉంటే ప్రాణానికి హాని జరగకుండా కాపాడుతుందని వైరా మోటార్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్ వరప్రసాద్ తెలిపారు.

# రిజర్వేషన్లపై గ్రామాల్లో తీవ్ర ఉత్కంఠ



**-మొదలైన ఎన్నికల సందడి**
**-అధిష్టానాల ఆశీస్సులు ఎవరికో..?**
**-ఈ నెల 15 తర్వాత నోటిఫికేషన్..?**

**ప్రజాపక్షం/వైరా:** సర్పంచ్, ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికలకు సంబంధించి రిజర్వేషన్లు ఏ విధంగా ఉంటాయో రిజర్వేషన్లు ఎవరిని వర్తిస్తాయో ఎవరి రాజకీయ భవిష్యత్తు ఎన్నికల్లో పరీక్షించుకోబోతున్నాము అనే విషయంలో ప్రతి గ్రామంలో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల రిజర్వేషన్ల విషయంలో తీవ్ర ఉత్కంఠ నెలకుంది. ప్రతి నలుగురు కలిసిన చోట ఒకటే మాట ఒకటే చర్చ అదే రిజర్వేషన్లు చర్చ ఇప్పుడు జరుగుతుంది. ఈ నెల15 తర్వాత ఎప్పుడైనా ఏ క్షణాల్లోనైనా సర్పంచ్ ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికలకు సంబంధించి ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే సూచనలు ఉన్నాయని పెద్ద ఎత్తున జోరుగా చర్చ కొనసాగుతుంది. రిజర్వేషన్లు ఏ విధంగా ఉంటాయో వివిధ రాజకీయాల పార్టీల అధిష్టానాలు ఎవరికి అండగా ఉంటాయో ఎవరికి చేసేందుకు గ్రీన్ సిగ్నల్స్ ఇస్తారు అని ఆశావుల్లో టెన్షన్ నెలకొంది. అయితే రిజర్వేషన్లు ఎవరికి వారే కలిసి రావాలని కోరుకుంటున్నారు. జిల్లా కేంద్రానికి ఇప్పటికే స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఎన్నికల సామాగ్రి చేరుకోవడం కూడా జరిగిందని బ్యాలెట్ నమూనాలు కూడా ముద్రించడం జరిగింది. ఇప్పటికే సర్పంచ్, ఎంపిటిసిలు, జెడ్పిటిసిల పదవీకాలం ముగిసిపోవడంతో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుంది. ఎన్నికలకు సంబంధించి అధికారులను కూడా ఏర్పాటు చేసుకోవడానికి సర్వం సిద్ధం చేశారు. ఇటీవల వైరా మండలం విప్పలమడక గ్రామంలో తెలంగాణ రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఫిబ్రవరి15 తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ రానుందని ఎన్నికలకు సిద్ధం ఉండాటనే క్యాడర్‌కు ఆయన సూచించారు. పొంగులేటి వ్యాఖ్యలతో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగనున్నాయని క్లారిటీ వచ్చినట్లు అయింది.

# నిందితుల అరెస్టు ఎప్పుడో..?



**ప్రజాపక్షం/కారేపల్లి:** సింగరేణి మండలంలోని రేలకాయలపల్లి ఆశ్రమ పాఠశాలలో గత నెల 30వ తేదీన విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు ఆ స్కూల్‌లో పని చేస్తున్న వార్డెన్ వెంకటేశ్వర్లు ఏ1గా, ప్రధానోపాధ్యాయులు నూనావత్ శ్రీనివాస్‌లు ఏ2గా, ఏటిడబ్ల్యూవో జమరుద్దీన్ ఏ3గా కారేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఇక్కడా వరకు బాగానే ఉంది. అయితే పలు సెక్షన్‌ల ద్వారా వార్డెన్ వెంకటేశ్వర్లను ఈనెల 2వ తేదీన రిమాండ్ చేసి జైల్‌కు పంపించారు. కానీ ఆ స్కూల్‌లో పని చేస్తున్న ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌ను మాత్రం రిమాండ్ చేయకుండా వదిలేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నూనావత్ శ్రీనివాస్ ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులతో రామబారం నడిపి నా మీద పెట్టిన కేసు రాజీ పడాలని, మేము కొంత నగదు ఇస్తామని ఏటిడబ్ల్యూవో, శ్రీనివాస్ ఇద్దరు ఫిర్యాదు దారులతో రాయబారం నడుతున్నట్లు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. కానీ విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘా నాయకులు తక్షణమే రిమాండ్ చేసి జైల్‌కు పంపాలని, బయట ఉండి కేసును నీరు గార్చే ప్రయత్నం చేస్తున్నారని లేని పక్షంలో భారీ ఎత్తున ఉద్యమం చేస్తామని ఏఐఎస్ఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, పిడిఎస్, టిఆర్‌విస్‌వి, ఎంఎస్ఎఫ్, ఏబీవీపీ విద్యార్థి సంఘ నాయకులు హెచ్చరిస్తున్నారు.

## ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు అర్హత సాధించిన మడుపల్లి విద్యార్థులు

**ప్రజాపక్షం/ మధిర రూరల్ :** ప్రతి సంవత్సరం కేంద్ర ప్రభుత్వం 8వ తరగతి విద్యార్థులకు నిర్వహించే నేషనల్ మీన్స్‌కం మెరిట్ స్కాలర్ పరీక్షలో మడుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభకనబర్చి స్కాలర్‌షిప్‌కు అర్హత సాధించినట్లు హెచ్‌ఎం తోట నర్సింహారావు తెలిపారు. పాఠశాల విద్యార్థులు చెరుకూరి రామ్‌తేజ్, పారా కార్తీక్‌లు అర్హత సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆయనతో పాటు ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు అభినందించారు.



## భూక్య హనుమకు ఘన నివాళి

**ప్రజాపక్షం/మధిర :** మధిర స్విమ్మర్స్ అసోసియేషన్ ఆడిట్ కమిటీ సభ్యులు, మాజీ కోశాధికారి భూక్య హనుమ ఇటీవల మృతి చెందిన సంగతి విధితమే. శుక్రవారం మధిర స్విమ్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంతాప సభను నిర్వహించి ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అసోసియేషన్‌లో జరిగే అన్ని కార్యక్రమాల్లో చురుకుగా ఉంటూ కుటుంబసభ్యుడిగా అందరితో కలిసిపోయి అందరిని నవ్వుతూ పలుకరించే హనుమ ఆకస్మాత్తుగా మృతి చెందటం బాధాకరమని, అతని మృతి వారి కుటుంబానికి తీరని లోటన్నారు. అనంతరం కుటుంబసభ్యులు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు జంగా నర్సింహారెడ్డి, రెయిన్బో రాంబాబు, చల్లా సత్యనారాయణ, గండూరి రాంబాబు, కళ్యాణపు పూర్ణచచంద్రరావు, జంగా శ్రీనివాసరావు, కొలగాని ప్రసాద్, ఆవుల సంతోష్‌కుమార్, లింగంపల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



## బంగారు దుకాణం ప్రారంభోత్సవం

**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** మండల కేంద్రానికి చెందిన వల్లాల నాగేశ్వరాచారి మండల కేంద్రంలో నూతనంగా బంగారు దుకాణం ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రొప్రైటర్ వల్లాల పవన్ చారి మాట్లాడుతూ వివాహాది శుభ కార్యక్రమాలకు సరసమైన ధరలకే బంగారు ఆభరణాలు తయారు చేసి ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ ప్రారంభోత్సవం కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారస్తులు అనుమూల వెంకటేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు

**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు మాదిగలు మాదిగ ఉప కులాల 40 ఏళ్ల సుదీర్ఘ పోరాటానికి తెరతీసిన కాంగ్రెస్ పార్టీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుకుంటూ ఈ సందర్భంగా వైరా మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు మోదుగు మురళి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్కకి, స్థానిక శాసనసభ్యులు మాలోతు రాందాస్‌నాయక్‌కి, జిల్లా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావుకి, పొంగులేటి శ్రీనివాసరెడ్డికి, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్‌కి కృతజ్ఞతలు తెలిపి వారికి పాలాభిషేకం చేసిన ఎస్సీ మాదిగలు, మాదిగ ఉప కులాలు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న వైరా నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు పమ్మి అశోక్ వారి చిత్రపటాలాకు పాలాభిషేకం చేసి ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 40 ఏళ్ల సుదీర్ఘ పోరాటానికి మాదిగ మాదిగ ఉప కులాల ఎస్సీ వర్గీకరణ దేశంలో ఏ రాష్ట్రం అమలుపరచని విధంగా ఈ రోజుత ఎలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ పార్టీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టి మా దగ్గర మాదిగ ఉప కులాల చిరకాల కలను సహకారం చేసినందుకు ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క మల్లుకి, జిల్లా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావుకు పొగులేటి శ్రీనివాసరెడ్డికి అదేవిధంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలుపుకుంటూ ఈ రాష్ట్రంలో గత పదేళ్ళు పరిపాలించిన టిఆర్ఎస్ మాదిగల పూర్తిగా నిర్లక్ష్యం చేసే కాలయాపన చేసి మాదిగలను మాదిగ ఉప కులాలను చిన్నచూపు చూసింది. కాని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం సుప్రీంకోర్టు మాదిగలకు అనుకూలంగా ఇచ్చిన తీర్పును వెంటనే అసెంబ్లీలో ప్రవేశపెడతాయని స్వాగతించి ఈనాడు ఆరు నెలల వ్యవధిలోనే అసెంబ్లీలో ప్రవేశపెట్టి మాదిగల అభ్యున్నతి కోసం కృషి చేసింది. కాంగ్రెస్ పార్టీ అని ముమ్ముందు కూడా మాదిగలను మాదిగ ఉప కులాలను వారి ఆర్థిక రాజకీయ విద్య ఉద్యోగం లాంటి ప్రతి విషయానికి సహకరిస్తుందని ఇది కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో తడికమళ్ళ నాగేశ్వరరావు, పమ్మి వెంకయ్య, తేళ్లూరి వీరయ్య, మోదుగు రత్నరాజు, వేల్పుల రత్నభరత్, నారపోగు రవి, దాసరి నాగరాజు, తాటి పుల్లయ్య, వేల్పుల మురళి, మోదుగు వెంకటి, మోదుగు శ్రీహరి, ఇనపనూరి రమేష్, మీరా, పమ్మి విజయ్ రాజు, ప్రేమ్ రాజు, పమ్మి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

